క్లుప్తంగా

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: అకాల వర్షంతో వరిధాన్యం తడిసి, పంటలు నేలవాలి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత ఆదిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని గంభీర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం తడిస్తే ఇప్పటికీ తూకం వేయకపోవడం బాధాకరమన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం తూకం వేయాలని, తప్ప తాలు పేరిట క్వింటాల్‌కు 4 నుంచి 5 కిలోలు ఎక్కువగా తూకం వేయడం సరికాదన్నారు. వర్షానికి దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.25వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.డీ అజీమ్, నాయకులు తొట్ల అంజయ్య, జువ్వాజి చౌదరి, పబ్బ శ్రీనివాస్, ఉరుమల్ల కృష్ణచారి, లక్ష్మన్, అభిలాష్, రాము పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

పెగడపల్లి: మండలంలోని ఏడుమోటలపల్లిలో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో మూడురోజులుగా జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా హోమం, విగ్రహ ప్రతిష్ఠాపన, భక్తుల సందర్శన తదితర కార్యక్రమాలు బ్రహ్మణోత్తములు గుండి రాజేందర్ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సర్పంచ్ రవినాయక్, ఎంపీటీసీ అంజయ్య పాల్గొన్నారు.

మల్లన్న ఆలయానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న డాక్టర్ సంజయ్

కోరుట్ల: మున్సిపల్ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామ శివారులో నూతనంగా నిర్మించనున్న మల్లన్న స్వామి ఆలయానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గడ్డమీది పవన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, కౌన్సిలర్లు బద్ది సుజాత, సత్యం, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు నల్ల మల్లేశ్‌రెడ్డి, సాగర్, నర్సారెడ్డి, సురేందర్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయానికి..



భూమిపూజ చేస్తున్న సంఘం నాయకులు

కోరుట్లరూరల్: మండలంలోని చిన్న మెట్‌పల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించే రేణుకా ఎల్లమ్మ ఆలయానికి బుధవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నూతిపెల్లి గంగరాజు, ఎంపీటీసీ పంచిరి విజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ బండి భూమయ్య, గౌడ సంఘం అధ్యక్షుడు మోత్కూరు సత్యంగౌడ్, ఉపాధ్యక్షుడు గడ్డం రమేశ్ పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు ఇవ్వొద్దు



వినతిపత్రం ఇస్తున్న రెగ్యులర్ కార్యదర్శులు

రాయికల్: రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు ఇవ్వొద్దని కోరుతూ బుధవారం ఎంపీడీవో సంతోష్‌కుమార్‌కు రెగ్యులర్ కార్యదర్శులు ప్రవీణ్, హరికృష్ణ, శ్రీహరి, నరేశ్ వినతిపత్రం అందజేశారు.

రోడ్ల మీదే ధాన్యం ఆరబోత

- రహదారులే కల్లాలుగా మారుతున్న వైనం
- ధాన్యం ఆరబోసేందుకు స్థలాలు కరువు
- నిలిచిన ఉపాధిహామీ కల్లాల నిర్మాణం
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు



పెగడపల్లి: వెంగళాయిపేట రహదారిపై రైతులు ఆరబోసిన ధాన్యం

పెగడపల్లి: మండలంలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు రహదారుల వెంట ఎక్కడ చూసినా.. ధాన్యం రాశులే కనిపిస్తున్నాయి. కానీ ఆ ధాన్యాన్ని ఆరబోసేందుకు సరైన స్థలాలు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఉపాధిహామీ ద్వారా నిర్మించే కల్లాల నిర్మాణం సైతం నిలిచిపోయాయి. స్థలాలు లేకపోవడం, పొలాల్లో పోసే పరిస్థితి లేక రోడ్లపైనే ధాన్యం కుప్పలు పోస్తున్నారు. అక్కడే ఆరబోసి అమ్మేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

స్థలం లేకపోవడంతో..

మండలంలోని రోడ్లన్నీ ధాన్యంతో నిండిపోవడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్లపై కుప్పలు ఉండటంతో రాత్రి సమయంలో తరచూ ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఉపాధిహామీ పనుల్లో కల్లాలను నిర్మించుకునే అవకాశం నిలిపివేశారు. స్థలాలు లేకపోవడం, పొల్లాలో ధాన్యం పోసుకునే పరిస్థితి లేక రోడ్ల పైనే ధాన్యం కుప్పలు పోస్తున్నారు. అక్కడే ఆరబోసి అమ్ముకుంటున్నారు.

ప్రధాన రహదారుల్లో..

మండలంలోని సుద్దపల్లి, కొండాయపల్లి, నర్సింహునిపేట, వెంగళాయిపేట, అయితిపల్లి తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్లపై కుప్పలు ఉండటంతో తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండేళ్ల కిందట ఉపాధిహామీ పనుల్లో కల్లాలు నిర్మించుకునే అవకాశం కల్పించారు. మండల వ్యాప్తంగా సుమారు 40 వరకు మంజూరు కాగా 15 మంది రైతులు మాత్రమే నిర్మించుకున్నారు. తర్వాత వీటిని ఉపాధిహామీ నుంచి తొలగించారు. ఈ సీజన్‌లో ఆశించిన దిగుబడి వస్తుండటంతో ధాన్యం ఆరబోసేందుకు కొనుగోలు కేంద్రాల్లో స్థలాలు లేక రహదారులపై రాశులుగా పోసి ఆరబోస్తున్నారు.

ధాన్యం కుప్పలతో ప్రమాదాలు..

మండలంలో గతేడాది ఆరవెల్లి–సుద్దపల్లి రహదారిపై ఆరబోసిన కుప్పలను బైక్ ఢీకొని ఆరవెల్లికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి మండలం అగ్గిమల్ల రహదారిపై పోసిన ధాన్యం కుప్పకు ఢీకొని మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సరిపడా కల్లాలు ఏర్పాటు నిర్మించాలని మండలంలోని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అనుమతి ఇవ్వడం లేదు



ఏడాది నుంచి ఉపాధిహామీ నుంచి కల్లాల నిర్మాణం తొలగించారు. దీంతో కల్లాల నిర్మాణానికి రైతులకు అనుమతి ఇవ్వడం లేదు. మళ్లీ అనుమతి వస్తే రైతులకు వెంటనే సమాచారం అందిస్తాం. – పుల్లయ్య, ఎంపీడీవో

ప్రమాదాలు జరుగుతున్నాయి



కల్లాలు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. రోడ్లపై ధాన్యం పోస్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాల్లో కల్లాలు నిర్మించే దిశగా చర్యలు తీసుకోవాలి. – మ్యాక తిరుపతిరెడ్డి, ఏడుమోటలపల్లి

ప్రభుత్వమే నిర్మించాలి



కల్లాలు ప్రభుత్వమే నిర్మించి ఇస్తే బాగుంటుంది. చిన్న సన్నకారు రైతులకు ఇది ఆర్థికభారంగా మారింది. రైతుల పంటపొలాల వద్ద ప్రభుత్వమే వీటిని నిర్మిస్తే రైతులు కల్లాల నిర్మాణానికి ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది. – చెట్ల కిషన్, వెంగళాయిపేట

రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం



జగిత్యాలఅగ్రికల్చర్: మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్: రైతుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ప్రారంభించారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, కౌన్సిలర్లు శ్రీధర్‌రెడ్డి, మహేందర్, సాయికుమార్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, డీఎం దివ్య భారతి, డీఎంవో ప్రకాశ్ పాల్గొన్నారు.

చౌడేశ్వరిమాత ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని చౌడేశ్వరి మాత ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల మార్కెట్‌యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్.లత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మార్కెట్ చైర్‌పర్సన్ నక్కల రాధ, జెడ్పీటీసీ మహేశ్, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్ రెడ్డి, జిల్లా సహకార అధికారి రామానుజాచారి, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి దివ్య భారతి, జిల్లా వ్యవసాయాధికారి సురేశ్‌కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, మార్కెట్ వైస్‌చైర్మన్ ఆసిఫ్, అడ్తి, ఖరీదుదారుల సంఘం అధ్యక్షుడు చిక్కుల భూమయ్య, కౌన్సిలర్ సమిండ్ల వాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

జగిత్యాలరూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఈ మేరకు బుధవారం జగిత్యాలరూరల్ మండలం బాలపల్లిలో రూ.4లక్షలతో నిర్మించే రెడ్డిసంఘం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఏఎంసీ చైర్మన్ నక్కల రాధ, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రైతుబంధు మండల కన్వీనర్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ భూపతిరెడ్డి, ఎంపీటీసీ రెడ్డి రత్న, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా చెక్కులు అందజేత..

జగిత్యాలరూరల్ మండలం బాలపల్లికి చెందిన రైతు గాలిపల్లి ఆనందం, పొరండ్లకు చెందిన రైతు ముద్దం ఆనందం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాలకు రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అందజేశారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేటలో రూ.20లక్షల జిల్లా పరిషత్ నిధులతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్ భూమిపూజ చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ ములాసపు లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ రాధ, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, జెడ్పీ సీఈవో రామానుజచార్యులు, సర్పంచ్ రౌతు జయ, డీఈ మిలింద్, ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై రైతులు దిగులు పడొద్దు



కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీలు

ధర్మపురి: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులు ఎలాంటి దిగులు పడొద్దని, తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని ఎంపీపీ, జెడ్పీటీసీలు ఎడ్ల చిట్టిబాబు, బత్తిని అరుణ అన్నారు. ఈ మేరకు మండలంలోని దోనూర్, దుబ్బలగూడెం, తుమ్మెనాలలో చేపడుతున్న వరి కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఎంపీటీసీ సత్యావతి, ఉపసర్పంచ్ జంగిలి మధూకర్ ఉన్నారు.

రైతులను ఆదుకోవాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న స్వామి

పెగడపల్లి: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ ధర్మపురి నియోజకవర్గం నాయకుడు గజ్జల స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఎల్లాపూర్, నందగిరి, అయితిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు వర్షాలకు దెబ్బతిన్న మామిడి, ఇతర పంటలకు ఎకరాకు రూ.30వేలు పరిహారం చెల్లించాలని కోరారు. నాయకులు కొమురయ్య, నందిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, అశోక్‌రెడ్డి, రవి, గంగాధర్, మహేందర్, శేఖర్, మల్లేశం, శ్రీనివాస్, పరశురామ్, భూమయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ వేసవి క్రీడాశిక్షణ శిబిరం ప్రారంభం

గొల్లపల్లి: గొల్లపల్లి జిల్లా పరిషత్ మైదానంలో వాలీబాల్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం జగిత్యాల జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో గొల్లపల్లి అసోసియేషన్ వారు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. మే 31 వరకు శిక్షణ శిబిరంలో 14ఏళ్లలోపు బాలబాలికలు పాల్గొనవచ్చని నిర్వాహకులు గురిజాల బుచ్చిరెడ్డి, మండల జగన్ తెలిపారు.

✦ పోస్టర్ ఆవిష్కరణ

మల్లాపూర్: కోరుట్లలోని మాదాపూర్ రోడ్డులో గల రూబీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం బ్రదర్ షఫీ ఆధ్యాత్మిక సందేశం ఇవ్వనున్నట్లు సర్పంచ్ సయ్యద్ హైదర్ కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో బ్రదర్ షఫీ ఆధ్యాత్మిక సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.


✦ 7న భరోసా సభ

ఇబ్రహీంపట్నం: మండలంలోని అమ్మక్కపేటలో బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో 7న హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభ పోస్టర్‌ను పార్టీ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుజ్జెరి ప్రకాశ్, మండల అధ్యక్షుడు బొబ్బిలి కిషోర్, ఉపాధ్యక్షుడు జిల్లాపెల్లి లక్ష్మణ్, నాయకులు బోయిని వెంకటేశ్, డీఎంఎం నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

✦ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లి గ్రామశాఖ రెడ్డి సంఘం భవన నిర్మాణానికి బుధవారం జెడ్పీటీసీ రాజేందర్‌రావు స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. మంత్రి ఈశ్వర్ కేటాయించిన రూ.5లక్షల నిధులతో నిర్మాణ పనులు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ నిర్మల, సర్పంచ్ సత్తమ్మ, ఎంపీటీసీ రవి, ఉపసర్పంచ్ రాజశేఖర్‌గౌడ్, నాయకులు సురేందర్‌రావు, సురేందర్‌రెడ్డి, రవి, రాజేశ్వర్‌రావు, మల్లారెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, జనార్దన్ రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కోరుట్లరూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ తోట నారాయణ, జెడ్పీటీసీ దారిశెట్టి లావణ్య బుధవారం ప్రారంభించారు. సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, సర్పంచ్, ఉపసర్పంచ్, సింగిల్‌విండో చైర్మన్ జగన్‌మోహన్‌రావు, ఏపీఎం శంకర్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మేడిపెల్లి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేడిపెల్లి ఎస్సై సుధీర్‌రావు సూచించారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోన్ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం యువతకు గంజాయి, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఏఎస్సై రవీందర్‌రావు, హసన్ మహ్మద్, దినేశ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు కీలకం



రాజును సన్మానిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

కోరుట్ల: సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం కీలకమని కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఎస్పీ భాస్కర్, డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుపై పది రోజులుగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు బుధవారం మధ్యాహ్నం పట్టణంలోని భీముని దుబ్బలో నివాసముండే రాజు తన ఇంటి ముందు లోపల 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోగా ఆయనను సీఐ సన్మానించారు. సీఐ మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన కూడళ్లు, కీలకమైన వీధుల్లో సుమారు 1500 సీసీ కెమెరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కోరుట్ల సర్కిల్‌లోని కోరుట్ల, మేడిపల్లి, కథలాపూర్ మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్సై సతీశ్ ఉన్నారు.

డిగ్రీ విద్యార్థుల జిజ్ఞాస ప్రాజెక్టు ప్రెజెంటేషన్



ప్రెజెంటేషన్ ఇస్తున్న విద్యార్థులు

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస ప్రాజెక్టు వర్చువల్ మోడ్‌లో జూమ్ ప్రెజెంటేషన్ చేశారు. కామర్స్ విభాగానికి చెందిన జిజ్ఞాస విద్యార్థులు స్టడీ ప్రాజెక్ట్ ఫోన్ పే వినియోగం, వర్తకులు వినియోగదారులు ఉపయోగించడం అధ్యయనంపై జూమ్ ద్వారా వివరించారు. జువాలజీ విభాగంలో వర్చువల్ వాటర్‌పై విద్యార్థులు జూమ్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాసవి, జిజ్ఞాస సమన్వయ కర్త హుమేరా సుల్తాన, ప్రాజెక్టు సూపర్‌వైజర్‌లు డాక్టర్ బూర్ల నరేశ్, నీరజ పాల్గొన్నారు.

‘బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నాం’



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

సారంగాపూర్: గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన బిల్లులతో పాటు, ఇతర పనులకు సంబంధించి 14 నెలల నుంచి బిల్లులు రావడం లేదని సారంగాపూర్ మండల సర్పంచ్‌లు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలువురు సర్పంచ్‌లు ఎమ్మెల్యేను కలిసి కేంద్రం, రాష్ట్రం నుంచి ప్రతి నెల రావాల్సిన నిధులు నిలిచిపోవడంతో తాము గ్రామాల్లో పూర్తి చేసిన వైకుంఠధామాలు, సీసీరోడ్లు, పల్లెప్రగతి పనుల వంటి కార్యక్రమాలు పూర్తిచేసిన వాటికి చెల్లింపులు చేయాల్సి ఉందని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి తమకు రావాల్సిన డబ్బులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. సర్పంచ్‌లు అర్రై లక్ష్మి, ఎడమల జయ, ఢిల్లీ రామారావు, కాసుగంటి వెంకటరమణారావు, కొండ శ్రీలత, పల్లపు వెంకటేశ్, భూక్య సంతోష్, కొత్తూరి రాజేశ్వరి, అజ్మీరా శ్రీలత, పల్లికొండ రమేశ్, దమ్మ గంగు, బెక్కెం జమున, మైనేని బుచ్చిమల్లు ఉన్నారు. బీర్‌పూర్ మండల కేంద్రంలో కరీంనగర్ డెయిరీ ఉత్పత్తులతో గ్రామానికి చెందిన నాయిని మహేశ్‌గౌడ్ ఏర్పాటు చేసిన దుకాణాన్ని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ కొల్ముల రమణ, సర్పంచ్ గర్షకుర్తి శిల్ప ఉన్నారు.

నీరా కేఫ్ ఏర్పాటు చేయడం అభినందనీయం



మాట్లాడుతున్న గోప సంఘం నాయకులు

జగిత్యాల: ప్రభుత్వం నీరా కేఫ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) నాయకులు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గీత వృత్తిని నమ్ముకుని ప్రమాదాలకు గురవుతూ చెట్లపై నుంచి పడి చనిపోయిన గీత కార్మికుల కుటుంబాలకు చేయూతనందించేందుకు ప్రభుత్వం రూ.5లక్షల బీమా కల్పించడం అభినందనీయమని, అలాగే నీరా కేఫ్‌ను ఏర్పాటు చేయడం గౌడ కులస్తులకు ఎంతో ఉపాధి కలుగుతుందన్నారు. గోపా నాయకులు దుర్గపు రవీందర్‌గౌడ్, అంబటి రాజయ్యగౌడ్, సత్యనారాయణ, సత్తయ్య, శ్రీనివాస్, చిరంజీవి, పొన్నం రమేశ్, సదాశివ్, భూమయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఇండియన్ సోల్జర్స్ టీమ్



ట్రోఫీతో విజేత టీమ్

కథలాపూర్: కథలాపూర్‌లో 10 రోజులుగా నిర్వహిస్తున్న కేఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా ఇండియన్ సోల్జర్స్ టీమ్ నిలిచింది. ద్వితీయ బహుమతి సూపర్ కింగ్ జట్టు అందుకుంది. విజేతలకు బుధవారం సాయంత్రం నాయకులు, నిర్వాహకులు ట్రోఫీతోపాటు నగదు అందజేశారు. వేములవాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత గోలి మోహన్, గడ్డం దివాకర్‌రెడ్డి, గాండ్ల స్వామి, వేణు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొంటాం



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

గొల్లపల్లి: అకాల వర్షాలకు తడిసిన వరిధాన్యం చివరి గింజ వరకు కొంటామని మార్కెట్ కమిటీ చైర్మన్ కాంపెల్లి హన్మండ్లు, జెడ్పీటీసీ జలేందర్, ఎంపీపీ నక్క శంకరయ్య తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, ప్రభుత్వం రైతులకు తగిన మద్దతు ధర నిర్ణయిస్తుందని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు బొల్లం రమేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నవ్వ తిరుపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చాడ వెంకటరమణ, మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె



పెగడపల్లి: నిరసన వ్యక్తం చేస్తున్న జేపీఎస్‌లు

మల్లాపూర్: మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీల సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మెకు మండల సర్పంచ్‌లు సంఘీభావం ప్రకటించారు.

కోరుట్లరూరల్: జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్ కోరారు. ఈ మేరకు 6వ రోజు దీక్షలో పాల్గొన్న కార్యదర్శులకు ఆయన మద్దతు తెలిపారు.

పెగడపల్లి: నిరవధిక సమ్మెలో భాగంగా మోకాలిపై కూర్చొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు.

జగిత్యాలరూరల్: మండల పరిషత్ కార్యాలయం ముందు సమ్మె కొనసాగించారు. వీరికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మద్దతు పలికారు.

రాయికల్: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన దీక్షకు బీజేపీ నియోజకవర్గ నాయకుడు, బీర్‌పూర్ ఇన్‌చార్జి పడాల తిరుపతి సంఘీభావం తెలిపారు.

ఇబ్రహీంపట్నం: సమ్మెలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేసి నిరసన వ్యక్తం చేశారు.